నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 7: జిల్లా కేంద్రంలోని పట్టణం, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, పట్టణ ఏఈ జావెద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు, పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కోరం లేక సమావేశం వాయిదా

కౌడిపల్లి, జూన్7: కోరం లేక కౌడిపల్లి మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మండల వ్యాప్తంగా 9మంది ఎంపీటీసీలు, ఎంపీపీ ఏ ఒక్కరూ రాకపోవడంతో కోరం లేదని ఎంపీడీవో శ్రీనివాస్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు.

అభివృద్ధి పనులే గుర్తింపునిస్తాయి: జడ్పీటీసీ

మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

కొల్చారం, జూన్ 7: పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలే గుర్తుండిపోతాయని జడ్పీటీసీ మేఘమాల అన్నారు. శుక్రవారం కొల్చారంలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తమ పదవీ కాలంలో ప్రజలకు చేసిన సేవలను అధికారులతో పంచుకున్నారు. సమావేశంలో లక్ష్మీనర్సింలు, డిప్యూటీ తహసీల్దార్ నగవర్ధన్, మెడికల్ ఆఫీసర్ రమేశ్, మండల వ్యవసాయాధికారిని శ్వేతా కుమారి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు వేమారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇండ్ల శిథిలాలు తొలిగింపు

తూప్రాన్, జూన్ 7: గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 15 వ వార్డులో వర్షానికి దెబ్బతిన్న ఇండ్ల పిట్టగోడలను, కూలిన శిథిలాలను ఆ వార్డు కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించారు.

వీల్‌చైర్లు అందజేత

చిన్నశంకరంపేట, జూన్7: మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు వర్షిత్, ఖాజాపూర్ తండాలోని దివ్యాంగుడు అశోక్‌కు భార్గవ్ ఆర్యన్ విమేక్ ఏ చేంజ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో సానీక్షా ఫౌండేషన్ చైర్మన్ శివ వీల్‌చైర్లను శుక్రవారం అందించాడు. కార్యక్రమంలో సురేశ్, సాయిబాబా, యాదగిరి, మధు, మహేశ్, భాను, సూర్య ప్రకాశ్, రాకేశ్ పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు

వివరాలను సేకరిస్తున్న పోలీసులు

తూప్రాన్, జూన్ 7: తూప్రాన్ మున్సిపాలిటీలోని కొత్త చెరువులో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉన్న కొత్త చెరువులోకి చేపలు పట్టేందుకు నర్సింలు, మరో ఇద్దరు కలిసి వెళ్లారు. నర్సింలు చేపలకు వేసిన గాలాన్ని తీసేందుకు వెళ్లి చెరువులోనే మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

చెట్టును ఢీకొని విలేకరి మృతి

మల్లేశం(ఫైల్)

కౌడిపల్లి, జూన్ 7: చెట్టును బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. కొల్చారానికి చెందిన విలేకరి మంగలి మల్లేశం (34) సొంత పనుల నిమిత్తం కౌడిపల్లికి వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో చెట్టుకు ఢీకొన్నాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో మెదక్ దవాఖానకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334218
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థులను గుర్తించి.. బడిలో చేర్పించి

నిజాంపేట: బడిబాటలో హెచ్ఎం ప్రభాకర్, కార్యదర్శి నర్సింహులు, మహిళా సంఘం సభ్యులు

శివ్వంపేట: చెన్నాపూర్ పాఠశాలలో అడ్మిషన్ చేస్తున్న ఎంఈవో బుచ్చానాయక్

చేగుంట: కర్నాల్‌పల్లి పాఠశాల విద్యార్థులతో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్ఎం సత్యనారాయణ

రామాయంపేట: రాయిలాపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

- కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం
- సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య
- బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి

బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని ఇంటింటికీ హెచ్ఎంలు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు తిరుగుతూ బడీడు పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. సర్కారు బడుల్లో కల్పించిన సదుపాయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఐదేండ్లు నిండిన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తున్నారు. ఐదేండ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని అవగాహన కల్పిస్తున్నారు. - న్యూస్ నెట్‌వర్క్, మెదక్, జూన్ 7

పాపన్నపేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఈవో నీలకంఠం

చిలిపిచెడ్: చిట్కుల్‌లో బడిబాట కార్యక్రమలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రామాయంపేట: లక్ష్మాపూర్ గ్రామంలో ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, టీచర్లు

మిషన్ భగీరథ ఇంటింటి సర్వే చేపట్టాలి

మాట్లాడుతున్న కలెక్టర్, సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

- సమిష్టి కృషితో ఎన్నికలు విజయవంతం
- సోమవారం నుంచి ప్రజావాణి ప్రారంభం
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్లపై ఇంటింటి సర్వే చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్ల ఇంటింటి సర్వేపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రెటరీలు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భగీరథ కనెక్షన్లు ఏర్పాటు చేసిన తర్వాత కుటుంబ సభ్యులు పెరగడంతో తాగునీటి అవసరాలకు అనుగుణంగా పది రోజులపాటు సర్వే చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అభివృద్ధి చేసిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో 400 కన్నా తక్కువ కనెక్షన్లు ఉంటే పంచాయతీ సెక్రటరీలు సర్వే చేయాలన్నారు. 400 కంటే ఎక్కువ కనెక్షన్లు ఉంటే, పంచాయతీ సెక్రెటరీతో పాటు, అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సర్వే చేయించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, మిషన్ భగీరథ ఈఈ సంపత్, టీవోటీలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యథావిధిగా ప్రజావాణి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యల్ని విన్నవించుకోవచ్చన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, ఇందుకు సమిష్టిగా కృషి చేసినందుకు అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ అభినందనలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఈ నెల 6వ తేదీ ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజల సహకారాలు మరువలేనివన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతిఒక్కరినీ ఆయన అభినందించారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

చేగుంట: ఎరువుల,విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ

పాపన్నపేట మండలంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నరేశ్, ఏవో కృష్ణ

తూప్రాన్‌లో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివానందం, ఏవో గంగుమల్లు

- నకిలీ, గడువు ముగిసిన విత్తనాలు విక్రయించవద్దు
- డివిజన్ వ్యవసాయాధికారులు

గడువు ముగిసిన, నకిలీ విత్తనాలను విక్రయించవద్దని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని వ్యవసాయాధికారులు ఫర్టిలైజర్ దుకాణదారులకు ఆదేశించారు. పలు మండలాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. తప్పనిసరిగా రిజిష్టర్లు రాయాలని సూచించారు. రైతులకు సీల్ ప్యాకెట్‌తో ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలన్నారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని రైతులకు సూచించారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. లైసెన్స్‌లు లేకుండా విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధిక ధరలకు అమ్మవద్దన్నారు. దుకాణాల్లో స్టాక్ రిపోర్ట్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలని సూచించారు. - చేగుంట/తూప్రాన్/పాపన్నపేట/నర్సాపూర్

నర్సాపూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఎస్సై శ్రీనివాస్

ఓడినా నిత్యం ప్రజలతోనే ఉంటాం

ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ

శివ్వంపేటలో మాట్లాడుతున్న ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

శివ్వంపేట, జూన్ 7: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడినా నిత్యం ప్రజలతోనే ఉంటామని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, శివ్వంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం శివ్వంపేటలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి ఒడిదుడుకులు, పోరాటాలు కొత్త కాదన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలు 39 మంది ఎమ్మెల్యేలను గెలిపించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ శ్రేణులంతా కలిసి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, నాయకులు పాపయ్యచారి, ఏదుల్లాపూర్ మాజీ సర్పంచ్ సునంద రెడ్డి, లచ్చాలు తదితరులు ఉన్నారు.

రూ.168 కోట్లతో సింగూరు కాల్వలకు సీసీ లైనింగ్

- జీవో విడుదలతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పుల్కల్, జూన్ 7: రూ.168 కోట్లతో సింగూరు కెనాల్ కాల్వలకు సీసీ లైనింగ్‌కు నిధులు విడుదల చేయడంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 40 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు సింగూరు కెనాల్ కాల్వల ద్వారా సాగుకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆ కాల్వలకు సీసీ లైనింగ్ లేక పోవడంతో అక్కడ డక్కడ పిచ్చి మొక్కలు మొలవడంతో పాటు మట్టితో కూడుకుపోయాయి. దీంతో రైతుల పంట పొలాల్లోకి సాగు నీరు వెళ్లకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేసి, జీవో విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సింగూరు ప్రాజెక్టు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- మందుల కొరత లేకుండా చూడాలి
- ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల పరీక్షలు చేయాలి
- వైద్యాధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. నియోజకవర్గంలో జబ్బు పడ్డ ప్రతి వ్యక్తికి ఉచితంగా వైద్యం అందాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్యాధికారులు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి సీజనల్ వ్యాధులు పొంచి ఉండే ప్రమాదం ఉన్నందున, అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరీక్షలు చేయించాలన్నారు. అన్ని రకాల పరీక్షలు ప్రభుత్వ దవాఖానలో చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వానకాలం వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడి వేడి భోజనం తీసుకోవాలన్నారు. నిల్వ చేసిన పదార్థాలు, బయటి తినుబండాలకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ప్రిలిమ్స్ నిర్వహించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 7: ఈనెల 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ నిబంధనల ప్రకారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 3,926 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్షా కేంద్రానికి ప్రశ్నాపత్రాలు తీసుకెళ్లే సమయంలో, పరీక్షా జరిగిన అనంతరం జవాబు పత్రాలను రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, టీజీపీఎస్సీ కమిషన్ ప్రతినిధి రోహిత్, జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ వంశీకృష్ణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎల్ఎం నిధులను సద్వినియోగం చేసుకోవాలి


రూ.కోటి డీడీని అందజేస్తున్న మేనేజర్ వెంకటేశ్

చేగుంట, జూన్7: గొర్రెల పెంపకందారులు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన నేషనల్ లైవ్ మిషన్ పథకం నిధులను సద్వినియోగం చేసుకోవాలని చేగుంట యూబీఐ మేనేజర్ వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం చేగుంటలోని బ్యాంకులో ముప్పిడి మధుకర్‌రెడ్డికి రూ.కోటి డీడీని అందజేశారు. ఎన్ఎల్ఎం పథకంలో గొర్రెల పెంపకం కోసం యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. రుణాన్ని సకాలంలో చెల్లిస్తే 50 శాతం సబ్సిడీ వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ రమాకాంత్, ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ నాగభూషణం తదితరులున్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- సీఎంకు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి బహిరంగ లేఖ

మెదక్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జనాభా ప్రతిపాదికన కుల గణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని గుర్తు చేశారు. 42 శాతం జనాభా ఉన్న బీసీలకు సరైన న్యాయం చేయాలన్నారు. కుల గణన తర్వాతనే సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా కోరారు.

పిడుగు పడి మహిళా రైతు మృతి

నర్సమ్మ (ఫైల్)

చిలిపిచెడ్,జూన్ 7: పిడుగు పడి మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, ఏఎస్సై మిస్బోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కుల్‌కు చెందిన బోయిన నర్సమ్మ(52)తన భర్త ఎల్లయ్యతో కలిసి పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటింటికి వస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడి న వర్షం కురిసింది. ఆ సమయంలో నర్సమ్మపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త ఎల్లయ్యకు ఎలాంటి గాయాలు కాలేదు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్సై మిస్బోద్దీన్, సిబ్బంది ఘటనా స్థలాని కి చేరుకుని పంచానామా నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టంకు తరలించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


8వ వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, జూన్ 7: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ఆయన పర్యటించి, వార్డులోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలు, వీధిదీపాలు, మంచినీరు, సీసీ రోడ్లు, డ్రైనేజ్, కరెంట్ పనులు తదితర సమస్యల గురించి కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఆయనతో కౌన్సిలర్ రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు జ్ఞానేశ్వర్, బాలరాజ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, ఉదయ్, రాములు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం బృందం

రామాయంపేట, జూన్ 7: రామాయంపేట శివారులోని బీసీ కాలనీ గుట్టవద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు మగ వ్యక్తి అని, రెండు నెలల క్రితం మృతి చెంది ఉంటాడు. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏండ్ల లోపు వయస్సు ఉంటాడు. మృతదేహం కుళ్లిపోవడంతో గుర్తుపట్టరాకుండా ఉంది. మృతుడి ఆచూకీ కోసం క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్నాం. మృతుడు నల్లటి ప్యాంటు, ఆరెంజ్ కలర్ రెడీమేడ్ షర్ట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.